# కుష్టువ్యాధినుంచి మిమ్మల్ని ఎలా కాపాడుకోవాలి?

జోయెల్ అల్మెడా, పిహ్చ్ . డి.

కుష్ఠు వ్యాధి ఒక క్రిమిద్వారా కలిగే చికిత్సా సాధ్యమైన వ్యాధి. భారతదేశంలోని ఏ ఆర్థిక, సామాజిక వర్గం కూడా ఈ వ్యాధికి అతీతం  కాదు. కనుక మీరు ఈ వ్యాధి గురించి అర్ధంచేసుకొని  మిమ్మల్ని ఏ విధంగా రక్షించుకోవాలో అన్నది చాలా ముఖ్యం.

భారతదేశంలో పెద్దలలో కాని, పిల్లలలో కాని ప్రతీ కొద్ది నిముషాల్లో ఒక కొత్త కుష్టి రోగిని గుర్తిస్తున్నారు. ఒక విధంగా ఇది మంచిదే, ఎందుకంటే వీరికి అంగవైకల్యం రాకముందే చికిత్స ప్రారంభించడం సాధ్యం అవుతోంది. భారతదేశంలో కుష్టువ్యాధిని నిర్మూలించేమని ప్రకటించటం పూర్తిగా ఒక పొరపాటే కాక మీ ఆరోగ్యానికికూడా హానికరం. ఏ ప్రాంతంలో నైనా అసలు ఒక కొత్త రోగైనా లేనప్పుడే ఆ వ్యాధి నిర్మూలన జరిగినట్లని  ప్రపంచ ఆరోగ్య సంస్థ, తన 2013 సంవంత్సర నివేదికలో, ఏ సందేహంకి తావు లేకుండా స్పష్టీకరించింది.

రాబోయే దశాబ్దంలో 10 లక్షలకు  పైగా భారతీయులకు కుష్టురోగ లక్షణాలు వచ్చే అవకాశాలున్నాయి. మీరు భారతదేశంలోని ఒక పట్టణంలో నివసిస్తున్నారనుకొంటే, మీ ఇంటి చుట్టూ ఉన్న 25 పెద్ద భవనాలను ఊహించుకోండి; బహుశా వాటిలో ఒక 1000 మంది ఉండవచ్చును. ఆ సంఖ్య చాలు రాబోయే 10 సవంత్సరాలలో కుష్టరోగ లక్షణాలతో ఇంకో వ్యక్తి తయారవడానికి. కుష్ఠురోగ లక్షణాలతో కన్పించే వ్యక్తులు మొత్తం సమస్యలో కేవలం సహశ్రాంసం మాత్రమే! రాబోయే దశాబ్దంలో, 20 మిలియన్ల నుంచి 100 మిలియన్ల పైగా భారతీయులకు శరీరంలో కుష్టుక్రిములు ప్రవేశిస్తాయి, కానీ వ్యాధి లక్షణాలు కనిపించవు.

మన దేశంలో బాహ్య వాతావరణంలో నీడలో కనీసం 5 నెలలవరకు కుష్టుక్రిములు బ్రతక కలుగుతాయి: ఇవే  మానవ శరీరంలో తిరిగి ప్రవేశిస్తే వృద్ధి కూడా చెందకలవు. కటిక పేదరికాన్ని నిర్మూలించిడం ద్వారా కుష్టు రోగుల సంఖ్య లో త్వరిత తగ్గుదలని, సంవత్సరానికి

10% కన్నా ఎక్కువ, చైనా లోని శాందొంగ్ రాష్ట్రంలో 50 సంవత్సరాల క్రితం, నార్వే లో శతాబ్దం క్రితం సాధించడం జరిగింది. భారతదేశంలో పరిస్థితి వేరు. 2008-9 నుంచి 2013-14 మధ్యలో వచ్చిన కొత్త రోగులు వ్యాధి నిర్ధారణప్పుడే అంగవైకల్యంతో గుర్తించబడుతున్నారు. మీరు ధనిక వర్గానికి చెందినా, భారతదేశ పట్టణాలలోని మురికివాడలలో, గ్రామీణ ప్రాంతాల్లో, పేదరికనిర్మూలన అన్నది మీ వ్యక్తిగత శ్రేయస్సుకి మంచిది.

కుష్ఠు రోగానికి చికిత్స తీసుకోకపోతే నరాలు దెబ్బతిని స్పర్శజ్ఞానం (చేతులు, పాదాలు, కళ్ళు) కోల్పోవటం జరుగుతుంది. నొప్పి తెలియని ఈ భాగాలలో మాటి మాటికి తగిలే గాయాల కారణంగా చేతులు పాదాల వ్రేళ్ళు, పాదాలు, కళ్ళు దెబ్బతిని అంగవైకల్యం వస్తుంది. నరాలు దెబ్బతిన్న కారణంగా చేతులు, కాళ్ళు, ముఖం లోని కండరాలు చచ్చుపడి పోతాయి. ఫలితంగా చేతి వ్రేళ్ళు తిన్నగా చేయడం, నడిచేటప్పుడు కాలి వ్రేళ్ళు ఎత్తకలగడం, కంటి రెప్పలు మూయ కలగడం కానీ వీలుపడదు. నరాలు దెబ్బతినకముందే వ్యాధి నిర్ధారణ చేయించి చికిత్సపొందడం చాలా మంచిది.

మీకేగాని చర్మం మీద మచ్చలుండి వాటిమీద బాల్ పెన్ చివరతో ముట్టుకుంటే స్పర్స తెలియక పోతే, చెవుల చివరలు వాచినట్టున్నా, చేతులు పాదాలలో నొప్పితెలియని గాయాలు మాటిమాటికి వస్తున్నా, చేతివ్రేళ్ళని తిన్నగా చేయలేకపోతున్నా, మీరు వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్ళాలి. అక్కడ మీ వ్యాధిని ఉచితంగా నిర్ధారించి అవసరమైతే ఉచితంగా బహుళ ఔషధ చికిత్సని (మల్టీ డ్రగ్ థెరపీ - MDT) ఇస్తారు. ఒక వేళ మీకున్న వ్యాధి కుష్టువ్యాధేనని నిర్ధారిస్తే, మీ కుటుంబసభ్యులకి కూడా ఈ వ్యాధి లక్షణాలున్నాయేమోనని పరీక్ష చేయించుకోవాలి. అందరిలో ఈ వ్యాధిక్రిములు చేరి ఉండవచ్చును.

MDT అతి త్వరగా కుష్ఠు క్రిముల్ని చంపుతుంది. MDT చికిత్స ప్రారంభించిన కొద్దిరోజులలోనే అత్యంత అంటురకపు కుష్టువ్యాధి అయినా వ్యాధిని వ్యాపించే శక్తిని కోల్పోతుంది. నరాలకి కలిగే నష్టాన్ని నివారించడానికిమాత్రం MDT పూర్తిగా సరిపోదు.

MDT ప్రారంభించిన మొదటి 2 సవంత్సరాలలోపున నరాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎందుకంటే చనిపోయిన క్రిములమీద శరీరం యుద్ధం చేస్తుంది. ఈ యుద్ధాన్నే 'Inflammation' అంటాం. నరాలే యుద్ధభూమిగా మారతాయి. నరాలలో వచ్చే 'Inflammation' నే న్యూరయిటిస్ అని అంటాం. ఈ అంతర్యుద్ధంలో నరాలకి తీవ్ర నష్టం కలిగి బాహ్యంగా కన్పించే అంగవైకల్యాలు కలుగుతాయి. దురదృష్టవశాత్తు ఈ న్యూరయిటిస్ చాలామట్టుకు బాధకల్గించకుండా (silent) ఉంటుంది. నరాలకి పూర్తిగా నష్టం జరిగేవరకు మీరు దీనిని పోల్చుకోవడం జరగకపోవచ్చును.

MDT ప్రారంభించిన మొదటి 2 సవంత్సరాలలోపున ప్రతీ నెలా మీ నరాలని పరీక్షించడానికి అనుభవం, చాకచక్యం ఉన్న కుష్ఠు కార్యకర్తల అవసరం ఉంది. ఇటువంటి చాకచక్యం ఉన్న కుష్ఠు కార్యకర్తలు ఇంతకుముందు ఉండేవారు కానీ, కుష్ఠు వ్యాధిని నిర్మూలించేమని పొరపాటుగా, తొందరపాటుగా ప్రకటించటం వలన కుష్ఠు కార్యక్రమ సేవలని దాదాపుగా రూపుమాపడం జరిగింది. చాకచక్యం ఉన్న కుష్ఠు కార్యకర్తలు silent న్యూరయిటిస్ ని గుర్తించగలరు. అందువలన మీరు ఈ Inflammation ని త్వరగా తగ్గించే చికిత్సని అవసరమైన వెంటనే పొందగలరు. ఇది నరాలని రక్షించి జీవితాంతం అంగవైకల్యంతో బాధ పడకుండా కాపాడగలదు. జీవితాంతం అంగవైకల్యంతో బాధపడే పరిస్తితి మీకు కల్పించడం కన్నా క్రమ పద్ధతిలో నరాలని పరీక్షించే పద్ధతి భారత కుష్ఠు కార్యక్రమంలో ఉండడం మంచిది, తక్కువ ఖర్చుతో కూడుకున్నది.

పూర్తి చికిత్స పొంది అంగవైకల్యం మిగిలిపోయిన వ్యక్తులు వ్యాధిని వ్యాపించలేరు. వారు అన్నివిధాలా మీలాంటి వారే కాని ఒకప్పుడు వారి నరాలు కుష్ఠు క్రిములవలన నష్ట పడటం జరిగింది. వారి శరీరంలోని కుష్ట క్రిములు ఏ నాడో అంతరించిపోయేయి. ఇతరులపట్ల ఏ విధమైన అభిమానం, గౌరవం మీరు చూపుతారో వారితో కూడా అలాగే ప్రవర్తించవచ్చును. ఆ పరిస్థితిలో మీరే ఉండి ఉండవచ్చును. మీకే గాని అంగవైకల్యం వచ్చి ఉంటే పునర్నిర్మాణ

శస్త్రచికిత్స, పునరావాసం మరియు ఇతర సహాయం భారత కుష్ఠు కార్యక్రమం, ఇతర భాగస్వామ్య సంస్థల ద్వారా లభిస్తాయి.

## మీ ద్వారా రాగల మార్పు ఏమిటి?

మిమ్మల్ని, మీరు ప్రేమించే వ్యక్తులని కుష్ఠు వ్యాధి రాకుండా కాపాడే చర్యల్ని ఇప్పుడే చేపట్టండి. మీ ప్రాంతానికి చెందిన MP, MLA, పంచాయతి మెంబర్లకి వ్రాసి భారత కుష్ఠు కార్యక్రమానికి మద్దతు ప్రకటించేలా చూడండి; ముఖ్యంగా కుష్టువ్యాధి కారణంగా కలిగే తీవ్రమైన నరాల నష్టానికి చక్కటి చికిత్స లభించేలా చూడమని కోరండి. వారికి ఈ క్రింది విషయాలని కూడా తెలియచేయండి:

1. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2013 లో అధికారికంగా నిర్వచించిన ప్రకారం కుష్టువ్యాధి నిర్మూలన జరగలేదు. రాబోయే దశాబ్దంలో 10 లక్షలకు పైగా భారతీయులు క్రొత్తగా ఈ వ్యాధిగ్రస్తులు కానున్నారు; ఇందులో రాజకీయనాయకుల కుటుంబాలకి, స్నేహితులకి కూడా ఈ ప్రమాదం పొంచిఉంది. కాబట్టి భారతదేశంలో ఒక శక్తివంతమైన కుష్ఠు కార్యక్రమం అందకరికి మేలు చేస్తుంది.

2. MDT చికిత్స ప్రారంభించిన మొదటి రెండు సంవత్సరాలపాటు ప్రతీ నెలా నరాలని పరీక్షించడానికి శిక్షణపొందిన కుష్ఠు కార్యకర్తల్ని భారత కుష్ఠు కార్యక్రమం నియోగించాలి. లేదంటే ప్రతీ సంవత్సరం చాల వేలమంది భారతీయులు, MDT తీసుకొంటున్నా, సకాలంలో నరాల వాపుకి సరైన చికిత్స అందక, నరాలు దెబ్బతిని క్రొత్తగా అంగవైకల్యం బాధితులు కావలసి వస్తుంది.

ఈ విధంగా వ్రాయటంవలన మీరూ, మీ కుటుంబం మరియు మీ స్నేహితులు క్షేమంగా ఉండకలుగుతారు.

---

అంతర్జాతీయంగా ఒక భారతీయ వైద్య కళాశాల లోని ప్రముఖులతో చర్చద్వారా ఈ వ్యాసం రూపు దిద్దుకుంది. వ్యాసం యొక్క తొలి ప్రతుల్ని ప్రపంచ ఆరోగ్య సంస్థకి , అంతర్జాతీయ కుష్ఠ నివారణా సంస్థలకి , నిప్పన్ ఫౌండేషన్ కి (జపాన్), నోవార్టిస్ ఫౌండేషన్ కి (నిరంతర ప్రగతి కోసం), లేప్రోసి మెయిలింగ్ లిస్టు ద్వారా ప్రపంచంలో ఉన్న కుష్ఠ వ్యాధి నిపుణులకి , భారతదేశంలో అనేక రాష్ట్రాలలో పనిచేస్తున్న ప్రజాహితం కోరుకొనే భారతీయ వైద్య బృందాలకి పంపించడం జరిగింది. ఇందులో పొందుపరచిన అభిప్రాయాలకి ఈ వ్యాసకర్తదే పూర్తి బాధ్యత.